
322 మంది ఉపాధ్యాయుల ఎంపిక

◆ నేడు నియామక పత్రాల అందజేత

సూర్యాపేట(మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 386 ఖాళీలకు గాను 1:3 నిష్పత్తి ప్రకారం 1158 మంది ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. ఈ నెల 2 నుంచి డీఈవో అశోక్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో చేపట్టిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు 871 మంది హాజరయ్యారు.



గుర్తింపు లేని యూనివర్సిటీల నుంచి ధ్రువపత్రాలు తీసుకొచ్చిన 21 మంది అభ్యర్థులను తిరస్కరించారు. నాలుగు రోజుల పాటు చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలనలో 95 శాతం స్థానికులకు అవకాశం కల్పించారు. ఓపెన్ కేటగిరిలో అయిదు శాతం స్థానికేతర అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. మొత్తంగా 385 ఖాళీలకు గాను ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, పీఈటీ అభ్యర్థులు 322 మందిని ఎంపిక చేశారు.

బస్సులో రాజధానికి

ఎంపికైన అభ్యర్థులకు దసరా ముందే నియామక పత్రాలు అందించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేపట్టింది.

జిల్లా వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థుల వివరాలు

పోస్టు	ఎంపికైన అభ్యర్థులు
ఎస్జీటీ	215
ఎస్ఏ	83
పీఈటీ	5
భాషా పండితులు	19

జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 322 మంది అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందించనున్నారు. అభ్యర్థులను రాజధానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రాంతాల వారీగా ప్రత్యేకంగా బస్సుల సౌకర్యం కల్పించారు. అధికారులు అభ్యర్థులకు మంగళవారం సమాచారం చేరవేసే పనిలో నిమగ్నమయ్యారు. హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎక్కడ ఉండాలి, వారి బస్సు ఎక్కడికి వస్తుంది, తదితర వివరాలు తెలియజేసి సిద్ధంగా ఉండాలని సమాచారం అందించారు.

దసరా తర్వాత పాఠశాలకు

దసరా సెలవుల తర్వాత పాఠశాలలు తెరచుకోనుండటంతో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరి పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న చాలా మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు ఎస్ఏలుగా పదోన్నతి పొందడంతో ఆయా చోట్ల ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఖాళీల భర్తీ జరుగుతుండటంతో ఆ సమస్య తీరనుంది. 2008 డీఎస్సీలో ఉద్యోగాలకు అర్హత సాధించి పలు కారణాలతో కొలువులు పొందని వారికి ప్రభుత్వం ఒప్పంద పద్ధతిన ఎస్జీటీలుగా నియమించే ప్రక్రియ చేపడుతోంది. వారొస్తే బోధకుల కొరత తీరుతుంది. మరోవైపు సర్దుబాటు ప్రక్రియ చేపట్టే అవకాశం ఉండటంతో విద్యావ్యవస్థ మెరుగుపడనుంది.

ఏర్పాటు చేపట్టాం – అశోక్, డీఈవో, సూర్యాపేట

జిల్లాలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాం. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందించనున్నారు. అందుకు సంబంధించి అభ్యర్థులను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాం. అభ్యర్థులు సమయానికి బస్సుల వద్దకు చేరుకోవాలి.

వరిపై కోతి, ఎలుక, ఆకుముడత ముప్పేట దాడి



అబ్బిరెడ్డిగూడెంలో కోతులు కొరికేసిన వరి

సాగర్ ఆయకట్టులో అన్నదాతలకు కోతులు, ఎలుకలు, ఆకుముడత పురుగుల బెంగ పట్టుకుంది. పొట్ట, ఈత దశలో ఉన్న పంటపై ఇవి ముప్పేట దాడులు చేసున్నాయి. సోమవారం రాత్రి గాలి దుమారంతో కురిసిన వర్షానికి పొలాలు నేలకొరుగుతున్నాయి. వరి గింజ పోసుకొనే దశలో దుబ్బు తీపిగా ఉండటంతో ఎలుకలు కొరికేస్తున్నాయి. గ్రామాల్లో భయభ్రాంతులు సృష్టిస్తున్న వానర సేన ఇప్పుడు ఏకంగా పొలాలపై పడింది. వరి దుబ్బులు పీకేయడంతో పాటు తొక్కి ఆగమాగం చేస్తున్నాయి. ఎకరానికి పది, పదిహేను బస్తాల దిగుబడి తగ్గేంతగా నాశనం చేస్తున్నాయి. ఆకుముడత పురుగు కారణంగా వరి కంకికి పక్కన ఉండే ఆకులు పచ్చదనం కోల్పోతున్నాయి. గింజ పోసుకోవడానికి అవసరమైన పోషకాలు అందక తాలుగా మారుతోంది. రెండుసార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది.

– న్యూస్‌టుడే, గరిడేపల్లి, మునగాల

తపాలా సేవ.. సాంకేతిక తోవ



మిర్యాలగూడలోని ప్రధాన తపాలా కార్యాలయం

◆ నేడు 'ప్రపంచ తపాలా దినోత్సవం'

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన, ఉప తపాలా కార్యాలయాలు..

నల్గొండ	సూర్యాపేట	భువనగిరి	మిర్యాలగూడ
25	17	12	10

● ప్రధాన కార్యాలయం ● ఉప కార్యాలయాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఉత్తరాల బట్వాడాకే పరిమితమైన తపాలా శాఖ, మారుతున్న కాలానికనుగుణంగా అనేక అధునాతన సేవలు అందిస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకుంటూ ఖాతాదారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే పోటీని తట్టుకునేందుకు సిబ్బందిని సైతం సిద్ధం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతుంది.

తక్షణ సేవలు..

ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్, నల్గొండ, భువనగిరిలో పోస్టల్ పేమెంట్స్ బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలంటే సమయాభావంతో ప్రజలు అనేక ఇబ్బందుడు పడుతున్నారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ సిబ్బందికి 5జీ చరవాణులు అందించి ఇంటి వద్ద కానీ, కార్యాలయంలో కానీ రెండే నిమిషాల్లో ఖాతా తెరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నల్గొండ డివిజన్‌లో 358, సూర్యాపేట డివిజన్‌లో 318 చరవాణులు పంపిణీ చేయగా.. తాజాగా సూర్యాపేట డివిజన్‌లో సిబ్బందికి మినీ ముద్రణ యంత్రాలను సైతం అందించారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 12 వరకు తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నారు.

తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 7 నుంచి 12 వరకు చేపట్టనున్న కార్యక్రమాలు..

- 9 – ప్రపంచ తపాలా దినోత్సవం
- 11 – అంత్యోదయ దినోత్సవం
- 12 – బాలికల ఆర్థిక అక్షరాస్యత దినోత్సవం

కొనసాగుతున్నవి..

ఇక తపాలా శాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పలు పథకాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. వీటిలో ముఖ్యమైనవి సుకన్య సమృద్ధి యోజన పథకంతో పాటు రూ.399, రూ.499 ఏడాది ప్రీమియంతో అందించే రూ.10 లక్షలు, రూ.15లక్షల బీమా పథకాలతో పాటు బాల ఆధార్, తపాలా కార్యాలయాల్లో ఆధార్ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

వీటితో పాటు మహిళ ఆర్థిక అభ్యున్నతికి ప్రవేశ పెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం, పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక స్వావలంభన అందించేందుకు వడ్డీ రేట్ల పెంపు వంటివి సైతం ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలు:

వెంకటేశ్వర్లు, తపాలా సూపరింటెండెంట్, సూర్యాపేట డివిజన్



ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది 150 ఏళ్ల థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నాం. వీటిలో ప్రధానంగా విద్యార్థులకు ఉత్తరాల ప్రాముఖ్యత, చరిత్రను వివరించేందుకు క్విజ్, వ్యాసరచన పోటీలతో పాటు బాలికా సాధికారత కోసం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించనున్నాం. వీటితో పాటు అన్ని తపాలా కార్యాలయాల్లో ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నాం.

6 వరకు ఉపాధ్యాయ, పట్టభద్ర ఓటరు నమోదు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పనపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మంగళవారం కలెక్టర్లతో దూర దృశ్య, శ్రవణ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా అర్హులైన ఓటర్లు తమ పేర్లను నవంబరు 6 వరకు నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఫారం -19, పట్టభద్రులు ఫారం -18 ప్రకారం దరఖాస్తులు అందించాలన్నారు. నవంబరు 1, 2024 ముందు ఆరేళ్లలో కనీసం మూడేళ్ల పాటు సెకండరీ పాఠశాల కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యా బోధనలో ఉన్న ఉపాధ్యాయులు, నవంబరు 1, 2021 వరకు డిగ్రీ, సమాన స్థాయి విద్యాబోధన పూర్తి చేసిన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు.



సూర్యాపేటలో దూర దృశ్య, శ్రవణ సమీక్షకు హాజరైన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ బీఎస్.లత

సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్.లత, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాస్, ఏవో సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పూల పండగ

భానుపురి, న్యూస్‌టుడే: నేటితరం యువత తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ రమేష్‌బాబు అన్నారు.



సూర్యాపేటలో నీటిపారుదల శాఖ కార్యాలయంలో బతుకమ్మ సంబరాల్లో అధికారులు

సూర్యాపేటలోని ఆ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ పండగలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం సద్దుల చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ శివధరం తేజ, డీఈలు రమేష్, శ్రీనివాస్ రావు, హరికృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణ, నగేష్, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ.. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట కోర్టుల ప్రాంగణంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సూర్యాపేట జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టుల సిబ్బంది బతుకమ్మలను అందంగా అలంకరించి ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండగ మన తెలంగాణ గౌరవానికి, అస్తిత్వానికి ప్రతీక అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, కె.సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సుదర్శన్‌రెడ్డి, డి.మల్లయ్య, పి.పిలు కె.లింగయ్య, కాకి రాంరెడ్డి, మహిళా న్యాయవాదులు, కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మలతో న్యాయమూర్తులు

'పేట' మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. గురువారం దుర్గాష్టమి (బతుకమ్మ పండగ) శుక్రవారం మహార్నవమి, శనివారం విజయదశమి (దసరా) పండగ సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఆర్.సంతోశ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాధారణ సెలవు కావడంతో నాలుగు రోజులు సెలవులు వచ్చాయని పేర్కొన్నారు. మరుసటి రోజు సోమవారం యథావిధిగా అన్నదాతలు మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తీసుకురావాలని కోరారు.

'డిజి లాకర్'..
ధ్రువపత్రాలు ఇక భద్రం

నాంపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసే సమయంలో విద్యార్హత ధ్రువపత్రాలు ఎంతో కీలకం. అవసరమైనప్పుడు మనదగ్గర ఉండకపోవచ్చు. ఆ సమయంలో మంచి అవకాశాలు చేజారిపోవచ్చు. ఇలాంటి సమస్యలు అధిగమించేందుకు కేంద్రం తీసుకొచ్చిన సురక్షిత డిజి లాకర్ యాప్‌లో ధ్రువపత్రాలు భద్రపర్చుకోవచ్చు. ఇటీవల పలు యూనివర్సిటీలు తమ పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులతో ఈ డిజి లాకర్ ఐడీని ఏర్పాటు చేసి ధ్రువపత్రాలు భద్రపరుచుకునే చర్యలు చేపడుతున్నాయి. ఈ సదుపాయం లేకముందు ఈ- మెయిల్స్‌లో భద్రపరుచుకునేవారు. వీటికంటే ప్రభుత్వ అధీకృత యాప్ డిజి లాకర్‌లో భద్రపర్చుకుంటే సురక్షితమని విద్యా నిపుణులు చెబుతున్నారు.



పోతాయనే భయం ఉండదు

డిజి లాకర్‌తో అనుసంధానమైన ప్రభుత్వ శాఖలు అందించే పత్రాలను వీటిలో భద్రపరచుకోవచ్చు. అందుకు ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే చాలు. అనుసంధానం కాకపోయినా స్కాన్ చేసిన పత్రాలనూ భద్రపరచవచ్చు. అందుకు ప్రతి లాకర్‌కు 1 జీబీ స్టోరేజి సామర్థ్యం కేటాయిస్తారు. ధ్రువపత్రాలు సమర్పించడానికి యూఆర్‌ఎల్ లింకు పంపించడానికి కొన్ని సంస్థలు అనుమతులు కూడా ఇస్తున్నాయి. విదేశీ, దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు ధ్రువపత్రాలు తీసుకెళ్లే సమయంలో పోతాయనే భయం ఉండదు.

డౌన్‌లోడ్ ఇలా..

★ ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి డిజి లాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

★ యాప్‌లో మీ పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్, ఫోన్ నంబరు, ఆరు అంకెల పిన్ నంబరు నమోదు చేయాలి.

★ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేస్తే డిజి లాకర్ యాప్‌ను ప్రారంభించడానికి సిద్ధమైనట్లు అర్థం.

★ యాప్‌లో పాన్ కార్డు, ఆధార్, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్ల జాబితా కనిపిస్తుంది.

★ వాటిలో మనకు కావాల్సినవి ఎంచుకొని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసుకోవాలి.

★ ఉదాహరణకు 10వ తరగతి మెమో కావాలంటే బోర్డు ఎంచుకున్నాక హాల్ టికెట్ నంబరు నమోదు చేయాలి. 2004 తర్వాత పత్రాలు అందుబాటులో ఉన్నాయి. అలారాని పక్షంలో డిజి లాకర్ డ్రైవ్‌ను క్లిక్ చేస్తే ప్లస్ సింబల్ కనిపిస్తుంది. క్లిక్ చేసి కావాల్సిన పత్రాలను మాన్యువల్‌గా అప్‌లోడ్ చేసి దాచుకోవచ్చు.

ఏమేం దాచుకోవచ్చు..

ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యార్హత ధ్రువపత్రాలు, మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, జనన పత్రాలు, ఆస్తి, రిజిస్ట్రేషన్ కాగితాలు, రేషన్ కార్డు, ఆరోగ్య బీమా, ఓటరు ఐడీ ఇలా.. ఒకటేమిటి మీకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, కార్డులు భద్రపర్చుకోవచ్చు.

మిద్దెపై పంట.. ఇంట్లో వంట



మిద్దె తోటలో పెంచుతున్న కూరగాయలు, పండ్ల చెట్లు

మిద్దె సాగే ఆరోగ్యమని, ఇలా పండించిన ఉత్పత్తులతో ఇప్పటివరకు తమకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని పేర్కొంటున్నారు ఈ ఉపాధ్యాయ దంపతులు. నల్గొండ జిల్లా కేంద్రంలోని హిమగిరి కాలనీకి చెందిన ఉపాధ్యాయ దంపతులు పుష్ప-శంకర్‌రెడ్డి.. గత 12 ఏళ్లుగా కూరగాయలు, పండ్ల చెట్లు, ఆకుకూరలు, వివిధ రకాల పూల, అలంకారం మొక్కలను మిద్దెపై పెంచుతున్నారు. ఆ తోటలోనే రాలిన ఆకులని సేంద్రియ ఎరువులుగా తయారు చేసి మొక్కలకు వినియోగిస్తున్నారు. ఇలా పండించిన వాటిని తాము తినడమే కాకుండా కాలనీలో సైతం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బయట నుంచి ఏ కూరగాయలు తెచ్చుకోమని పేర్కొంటున్నారు. గతంలో మధుమేహ వ్యాధి ఉన్నా.. సేంద్రియ ఎరువుల వాడకంతో పండిన వాటిని తింటుండటంతో ప్రస్తుతం నియంత్రణలో ఉందని తెలిపారు. 100 రకాలకు పైగా కూరగాయాలు, పండ్ల, పూల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. హైదరాబాదులో నిర్వహించే మొక్కల ప్రదర్శనలు తిలకిస్తూ.. అక్కడ నుంచి కొత్త వంగడాలను తీసుకొచ్చి పెంచుతున్నామని, అరుదైన చెర్రీ, డ్రాగన్, వాటర్ ఆపిల్, టేబుల్ లెమన్, స్వీట్ లెమన్, తెల్ల అల్లనేరేడు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ బటన్ మిర్చి ప్రత్యేకంగా పెంచుతున్నట్లు.. ఇది చాలా ఘాటుగా ఉంటుందని పేర్కొన్నారు.

– ఈనాడు నల్గొండ







లిల్లీ మొక్కల వద్ద ఉపాధ్యాయుడు శంకర్ రెడ్డి



సాగుచేసిన సొరకాయ వద్ద ఉపాధ్యాయిని పుష్ప

ఆ అలవాటుకు.. 25 ఏళ్లు



రాగూర్ సేకరించిన వివిధ దేశాల తపాలా స్టాంపులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

చిన్నతనంలో తమ ఇంటికి వచ్చే ఉత్తరాల స్టాంపులు సేకరించడం అలవాటుగా మారిన అతడికి.. చదువుకునే వయసులో బహుమతిగా వచ్చిన నేపాల్ కరెన్సీ నోటు.. వివిధ దేశాల కరెన్సీ నోట్ల సేకరణకు ప్రాణం పోసింది. దీంతో 25 ఏళ్లుగా వేలాది స్టాంపులు, నాణేలు, నోట్లు సేకరించిన అతడు.. నేటితరం చిన్నారులకు వాటి గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో తన వ్యాపార ప్రాంతంలో ప్రదర్శిస్తున్నాడు.

★ మిర్యాలగూడ పట్టణానికి చెందిన గరిణె రాగూర్.. డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. 1998లో నాలుగో తరగతి చదువుతున్నప్పుడు తన ఇంటికి వచ్చే ఉత్తరాల నుంచి స్టాంపులు సేకరించడం మొదలు పెట్టాడు. ఆ తర్వాత రెండేళ్లకు తమ ఇంటి సమీపంలోని ఓ వసతిగృహానికి కాపలాదారుగా ఉన్న నేపాల్ వ్యక్తిని వారి నగదు ఎలా ఉంటుందని అడుగగా.. అతడొక నోటును బహుమతిగా ఇచ్చాడు. దానిని మురిపెంగా చూసుకుని ఇతర దేశాల కరెన్సీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నాడు. దీంతో దీనినే తన అలవాటుగా మలచుకుని నేటి వరకు సుమారు వంద దేశాల నుంచి సేకరించిన 2వేల నోట్లు, 5వేల నాణేలు, వివిధ దేశాలకు చెందిన 4వేల స్టాంపులు సేకరించాడు. వీటితో పాటు దేశానికి చెందిన సుమారు 400 రకాల అగ్గిపెట్టెలు సైతం సేకరించాడు. వీటి విలువ సుమారు రూ. 10లక్షలకు పైగానే ఉంటుందని అంచనా.

○ నాణేలు, విదేశీ కరెన్సీ నోట్లు సేకరిస్తున్న వ్యాపారి



వివిధ దేశాల కరెన్సీ నోట్లు

పురాతనం నుంచి అధునాతనం వరకు..

రాగూర్ సేకరించిన వాటిలో పురాతన కాలం నుంచి ఇటీవలి వరకు కరెన్సీ నోట్లు, స్టాంపులు ఉన్నాయి. నిజాం నవాబుల కాలం నాటి స్టాంపులు, కరెన్సీ నోట్లతో పాటు వెండి నాణేలు, ఢిల్లీ సుల్తానుల, తమిళనాడు చోళ రాజుల, మైసూర్ టిప్పు సుల్తాన్ కాలాల నాటి నాణేలు సైతం సేకరించాడు. వీటితో పాటు ఇటీవల హాంకాంగ్, రష్యా, ఈస్ట్ కరేబియాన్, న్యూజిలాండ్, సోలోమన్ ఐలాండ్, సింగపూర్, మాల్దీవులు తదితర దేశాలు ప్రవేశపెట్టిన పాలిథిన్ కరెన్సీ నోట్లు సైతం సేకరించాడు. వీటిలో ప్రపంచంలోనే అతి విలువైన దుబాయ్ కరెన్సీతో పాటు తక్కువ విలువైన ఇండోనేషియా కరెన్సీ నోట్లు సేకరించాడు. యుగోస్లేవియాలో పాత నోట్లు రద్దు చేసిన సమయంలో ముద్రించిన కొత్త నోట్లు సైతం ఇతడి సేకరణలో భాగమయ్యాయి. ఇండోనేషియా కరెన్సీ నోటుపై వినాయకుడి చిత్రం, క్యూబా కరెన్సీ నోటుపై చెగువెరా చిత్రం ముద్రించిన నోట్లు సైతం సేకరించి ఔరా అనిపిస్తున్నాడు.

పిల్లలకు తెలియజేయాలనే: గరిణె రాగూర్, మిర్యాలగూడ



తపాలా స్టాంపులు, కరెన్సీ నోట్లు, నాణేలను విక్రయించాలన్న ఆలోచన ఎప్పుడూ చేయలేదు. వాటిని పెట్టెల్లో నిరుపయోగంగా ఉంచడం కంటే.. మా దుకాణానికి వచ్చే చిన్నారులకు వివిధ దేశాల కరెన్సీ.. తపాలా స్టాంపుల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో నోట్లను టేబుల్‌పై అద్దం కింద పేర్చాను. వీటిని చూసిన చిన్నారులు వివిధ కరెన్సీ నోట్లు, వాటి విలువ, ప్రత్యేకతల గురించి వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నాను.

హీటర్ వాడుతున్నారా..
ఈ జాగ్రత్తలు తప్పనిసరి



భానుపురి, న్యూస్‌టుడే: నిత్యం ఎక్కడో ఒకచోట విద్యుత్తు ప్రమాదాల కారణంగా మరణిస్తూనే ఉన్నారు. ఇంట్లో వాడే కరెంటు పరికరాలపై అవగాహన లేక విద్యుదాఘాతానికి గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం, శీతాకాలంలో వేడి నీటితో స్నానం చేస్తారు. ఇందుకు నీళ్లను వేడి చేసేందుకు హీటర్ వినియోగిస్తారు. కొనేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో విద్యుదాఘాతానికి గురవుతున్నారు. విద్యుత్తు ప్రసారం జరిగే ఇనుము బకెట్లో కాకుండా ప్లాస్టిక్ బకెట్‌లో నీటిని వేడిచేయాలి. హీటర్‌ను వినియోగించేటప్పుడు నీటిలోకి ఎంత మేర ఉంచాలో దానిపై గుర్తు ఉంటుంది. బకెట్‌లో ఉంచే సమయంలో కర్రను వాడాలి. నాణ్యత లేని హీటర్లను ఉపయోగించటం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. పాత వాటర్ హీటర్ రాడ్లను ఉపయోగించొద్దు. హీటర్‌కు లవణాలు పట్టుకొని ఉంటాయి. వారానికోసారి శుభ్రం చేస్తే త్వరగా నీరు వేడవుతుంది.

ఇలా చేస్తే మేలు..

- స్విచ్ ఆన్ చేసినప్పుడు నీటిని తాకొద్దు. విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంది. ఆఫ్ చేసిన 10 సెకన్ల తర్వాత వాటర్ హీటర్ బయటకు తీసి చూడాలి.
- పిల్లలు ఉన్నచోట, చేతికి అందే ప్రాంతంలో హీటర్ పెట్టవద్దు. విద్యుదాఘాతం జరిగే ఆస్కారం ఉంటుంది. స్నానపు గదుల్లో ఏర్పాటు చేసుకోవద్దు.
- హీటర్ పెట్టిన తర్వాత వేడి ఉన్నంత సేపు దానిని ప్లాస్టిక్ బకెట్‌కు దూరంగా ఉంచాలి. వేడికి ప్లాస్టిక్ కరిగిపోతోంది.
- హీటర్లను గంటల తరబడి పెట్టవద్దు.
- హీటర్ రాడ్‌ను నీళ్లలో మునిగేలా చూసుకోవాలి.
- స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత, ప్లగ్‌ను తీసిన తర్వాతే నీళ్లను తాకి వేడిని పరిశీలించాలి.
- ఐఎస్ఐ మార్కు ఉన్న హీటర్లను కొనుగోలు చేయాలి. 1500-200 వాట్స్‌తోపాటు ఓల్టేజీ 230-250 మధ్య ఉండే హీటర్లను కొనాలి.

జిల్లాలో గృహ విద్యుత్తు కనెక్షన్లు

జిల్లా	కనెక్షన్లు
సూర్యాపేట	4,51,501
నల్గొండ	5,82,220
యాదాద్రి	3,75,247

చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి ఒకరికి జైలుశిక్ష

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన పట్టేటి రామయ్య ఎలియాస్ రాములుకు సంవత్సరం జైలుశిక్ష ఖరారు చేస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. ఆ తీర్పు ప్రకారం వివరాలు.. రావులపల్లి గ్రామానికి చెందిన పట్టేటి రామయ్య తన అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన కసనబోయిన లింగయ్య వద్ద రూ. రెండు లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించే నిమిత్తం అదే మొత్తానికి చెక్కు జారీ చేశాడు. దాన్ని బ్యాంకులో జమచేయగా రామయ్య ఖాతాలో నగదు నిల్వలు లేని కారణంగా చెల్లుబాటు కాలేదు. నోటీసు పంపినా ఫలితం లేకపోవడంతో బాధితుడు తుంగతుర్తి ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో ఫిర్యాదు దాఖలు చేశాడు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడైన రామయ్యపై నేరాన్ని నిర్ధారించి సంవత్సరం జైలుశిక్ష విధించడంతోపాటు రూ. 3.60 లక్షలు బాధితునికి పరిహారంగా చెల్లించాలని ఆదేశిస్తూ గతంలోనే తీర్పు ఇచ్చింది. తీర్పుపై నిందితుడు జిల్లా న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేసుకోగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నిందితునికి విచారణ న్యాయస్థానం విధించిన జైలుశిక్ష, జరిమానాలను ఖరారు చేస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు.

గంజాయి స్మగ్లర్లపై కేసు నమోదు

చౌటుప్పల్‌గ్రామీణం: కారులో అక్రమంగా 54 కిలోల గంజాయిని తరలిస్తుండగా పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని పుణేకు కారులోని సీట్ల కింద రహస్య స్థావరంలో ముగ్గురు స్మగ్లర్లు గంజాయిని తరలిస్తున్నట్టు చెప్పారు. రాచకొండ ఎస్వోటీ పోలీసులతో కలిసి కారును, గంజాయిని, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రకాశ్ ధ్యానేశ్వర్, నవనత్ బాబన్ మహిత, ధర్మ అశోభ తువార్‌లపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఎదురుచూపులు ఉండవిక..!



సూర్యాపేటలోని మార్కెట్ యార్డులో పత్తి బస్తాలు(పాత చిత్రం)

❒ పత్తి నగదు సమాచారానికి **కాటన్-అల్లై యాప్**

భానుపురి, న్యూస్‌టుడే:

సీసీఐకి పత్తి విక్రయించిన రైతులకు ఇక నుంచి దిగులుండదు. నగదు బ్యాంకు ఖాతాలో పడే వరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వారికి ఇక నుంచి ఆ ఇబ్బందులు ఉండవు. సమయానికి నగదు జమ కాకపోవడంతో అధికారుల వద్దకు వెళ్లి వాకబు చేస్తుంటారు. ఇందుకు గ్రామాల నుంచి పట్టణంలోని కార్యాలయాలకు వెళ్తొస్తుంటారు. అటు సీసీఐ కార్యాలయాల చుట్టూ అన్నదాతలు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సీసీఐ 'కాటన్-అల్లై' పేరుతో కొత్త యాప్‌ను కొనుగోళ్ల వరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే మేలు చేకూరనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

7.18 లక్షల ఎకరాల సాగు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈసారి 7.18 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. అంతర్జాలం వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఇంట్లో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంటోంది. సీసీఐ తీసుకొచ్చే యాప్ ద్వారా పత్తి నగదు చెల్లింపు ప్రక్రియ ఏ మేరకు వచ్చిందనే కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు వీలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల పంట దెబ్బతింది. దీంతో దిగుబడిపై రైతుల్లో దిగులు నెలకొంది. సరాసరి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు వివరాలు (ఎకరాల్లో..)

సూర్యాపేట	78,094
నల్గొండ	5,40,022
యాదాద్రి	1,00649

ఎయిమ్స్‌ను సందర్శించిన రాష్ట్ర వైద్య బృందం

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, హైదరాబాద్ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్యులు, సంబంధిత శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియాతో పాటు వైద్య బృందం సభ్యులు.. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ బృందం సభ్యులకు వివరించారు. సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన తెరపై ఆసుపత్రి పురోగతిని వివరించారు. అనంతరం రాష్ట్ర బృందం ఆసుపత్రిలోని ఓపీడీ, ఇన్‌పేషెంట్, అత్యవసర విభాగాలు, పలు ల్యాబ్‌లను, ఎయిమ్స్ ఆవరణలో నిర్మితమవుతున్న నూతన భవన నిర్మాణ సముదాయాలను తిరిగి పరిశీలించారు. ఎయిమ్స్ మెడికల్ పర్యవేక్షకుడు డాక్టర్ అభిషేక్ అరోరా, వైద్యులు సంగీత సంపత్, శ్యామల అయ్యార్, తదితరులు పాల్గొన్నారు.



బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య సేవల వివరాలు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బృందానికి వివరిస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ భాటియా

'తనిఖీలు జరుగుతున్నాయ్'

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రైస్ మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా అనే దానిపై, సీఎంఆర్ గడువు తిరిగి పెంచేందుకు మిల్లుల్లో తనిఖీలు జరుగుతున్నాయని పౌరసరఫరాల డీఎం టీఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఈనాడులో 'ధాన్యం ఉందా.. ధనమై పోయిందా' శీర్షికతో వచ్చిన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. జిల్లాలో 2023-24 వానాకాలంలో 2,08,113 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, దానికి మిల్లర్లు సీఎంఆర్ బియ్యం 1,39,436 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అందులో 82,729 మెట్రిక్ టన్నులు మిల్లర్లు ఇచ్చారని, ఇంకా 57,282 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉందని తెలిపారు. గత నెల 30తో సీఎంఆర్ గడువు ముగిసినందున ప్రస్తుతం ఎఫ్‌సీఐ మిల్లుల్లో రావాల్సిన బియ్యానికి ధాన్యం ఉందా లేదా తెలుసుకోవడం కోసం, మళ్లీ బియ్యం పెట్టేందుకు గడువు ఇచ్చేందుకు తనిఖీలు జరుగుతున్నాయని వివరించారు. బియ్యం బకాయి ఉండి మిల్లుల్లో ధాన్యం లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతి.. ఆందోళన

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందగా.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళనకు దిగిన ఘటన మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో చోటు చేసుకుంది. బాధిత బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన 10 నెలల గర్భిణి మౌనికకు నొప్పులు రావడంతో ఈ నెల 6న పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పురిటి నొప్పులు కావనే కారణంతో రెండు రోజుల పాటు సాధారణ ప్రసవం కోసం ఆసుపత్రిలో ఉంచారు. మంగళవారం ఉదయం గర్భంలోని శిశువు గుండె సక్రమంగా కొట్టుకోవడం లేదని హడావుడిగా శస్త్ర చికిత్స చేసి మగ బిడ్డ పుట్టాడని.. శిశువు ఆరోగ్యం సక్రమంగా లేనందున నల్గొండకు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అంతదూరం వెళ్తే ప్రమాదం జరుగుతుందని భావించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్తామని చెప్పడంతో.. శిశువును చూపించకుండా వివిధ కారణాలతో ఆడ శిశువు మృతి చెందిందని తెలిపారని ఆరోపించారు. తొలుత మగ శిశువు అని చెప్పిన వైద్యులు.. తర్వాత ఆడ శిశువు అని చెప్పడంలో ఆంతర్యమేమిటని.. అంతా బాగానే ఉందని చెప్పి హడావుడిగా శస్త్ర చికిత్స నిర్వహించటమేమిటని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు.

★ ఘటనపై ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వహీదా, డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ.. రెండు రోజులుగా గర్భస్థ శిశువు ఆరోగ్యం బాగానే ఉందని.. ఈ ఉదయం గుండె సక్రమంగా కొట్టుకోకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అత్యవసరంగా శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. శిశువు మెడకు బొడ్డు తాడు చుట్టుకోవడంతో పాటు గర్భంలోనే మల విసర్జన జరిగి, ఉమ్మనీరుతో పాటు మింగడంతో ఊపిరాడక మృతి చెందినట్లు వివరించారు. ఆసుపత్రి వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. కాగా ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ నాగార్జున తెలిపారు.



మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో ఆందోళన చేస్తున్న బాధిత బంధువులు

ప్రభుత్వ బడులకు కొత్త ఉపాధ్యాయులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడులకు కొత్త ఉపాధ్యాయులు రాబోతున్నారు. డీఎస్సీ-2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం బుధవారం నియామక ఉత్తర్వులు ఇవ్వనుంది. ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీ-2024 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చివరిదశకు చేరింది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ప్రభుత్వం 1268 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలు ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది. ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియలో 1:3 చొప్పున మెరిట్ అభ్యర్థులను తీసి ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిపారు. వారి నుంచి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాలు అందచేయనున్నారు. డీఎస్సీలో మొదటి సారి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించి త్వరితగతిన ఫలితాలు వెల్లడించి నియామకాలు చేపట్టడం గమనార్హం.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండురోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.క్రెష్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్ కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

కోదాడ
•కోదాడ •హుజూర్‌నగర్

ప్రపంచ తెలుగు సాహితీ-కళా జాతరకు ఆహ్వానం


చిట్యాల ఉపేందర్

మోతె, న్యూస్‌టుడే: మండలంలోని నామవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి చిట్యాల ఉపేందర్ ప్రపంచ తెలుగు సాహితీ- కళా జాతర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్నారు. ఈనెల 19, 20 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 24 గంటలపాటు జరిగే కళా జాతరలో పాల్గొనాలంటూ నిర్వాహకులు ఆహ్వానం అందజేసినట్లు ఉపేందర్ మంగళవారం తెలిపారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థులు వృత్తి విద్యాకోర్సులతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని కేవీకే మృత్తిక విభాగం శాస్త్రవేత్త ఏ.కిరణ్ సూచించారు. గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల్లో అగ్రికల్చర్ ట్రేడ్ సంబంధించి పది రోజుల ఇంటర్న్‌షిప్ కోసం కేవీకేను సందర్శించారు. జీవన ఎరువుల తయారీ, వర్మీ కంపోస్టు తయారీ విధానం, మైక్రో ఇరిగేషన్, డ్రిప్, స్ప్రింక్లర్ తదితర నీటి పారుదల పద్ధతులు, వాటి విధానం వివరించారు. ఒకేషనల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు జీవ ఎరువుల ఉపయోగం వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మండలంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు చోటు దక్కిందని ఆ సంఘం మండల అధ్యక్షుడు బాలక్రిష్ణ మంగళవారం తెలిపారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఐంజమూరి కాటయ్య, బజావత్ దస్రునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా షేక్ యూసఫ్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిల్‌లో పదవులు చేపట్టిన సందర్భంగా మండల మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, దర్గారావు, బాలునాయక్ తదితరులు నూతన నాయకత్వాన్ని అభినందించారు.

నడిగూడెం: కరివిరాల ఆదర్శ పాఠశాలలో పీజీటీగా పనిచేస్తున్న కె.నాగేశ్వరరావు పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలను పట్టించుకోని ప్రభుత్వాలు: సీపీఎం

మోతె, న్యూస్‌టుడే: దేశంలో నిరుపేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సీపీఎం జిల్లాకార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి విమర్శించారు. రావిపహాడ్ గ్రామంలో మంగళవారం జరిగిన పార్టీ మండల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు పాలనా పగ్గాలు చేతబట్టి పెద్దలకు అనుకూలమైన నిర్ణయాలకు పెద్దపీట వేస్తూ పేదలను పక్కన పెడుతున్నాయన్నారు. ఆరు హామీలంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీనీ అమలు చేయకుండా అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏదాది సహాయం చేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీ 40శాతం మందికే పరిమితమైందన్నారు. అంతకుముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అమరులకు నివాళులు అర్పించారు. జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు సైదులు, వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రావిపహాడ్‌లో సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించి అమరులకు నివాళి అర్పిస్తున్న జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి తదితరులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న మురుగు కాలువలలో తీసిన వ్యర్థాలను పక్కనే వేయడంతో వర్షం వచ్చినప్పుడు మళ్లీ కాలువలలోకి వెళుతున్నాయని, వెంటనే తొలగించిన వ్యర్థాలను ఎత్తివేయాలి.
—రమేష్, కోదాడ

✔ పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగిస్తాం.
—రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

? నేరేడుచర్ల పట్టణంలో సీపీఎం ఆఫీసుకు వెళ్లేదారిలో నీరు నిల్వ ఉండటంతో కంకర పోయించి పని చేయించకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.
— మొగిలిచర్ల అనిల్, నేరేడుచర్ల

✔ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
– బచ్చలకూరి ప్రకాశ్, పురఛైర్మన్, నేరేడుచర్ల

? నేరేడుచర్ల మండలం ఫత్తేపురంలో పంచాయతీ ట్రాక్టర్‌లో చెత్తసేకరణ అన్ని వీధులలో జరపడం లేదు?
– ఉపేందర్, ఫత్తేపురం

✔ చెత్త సేకరణకు ట్రాక్టర్‌ని పంపుతున్నాం. అన్ని వీధులకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.
– వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి.

పట్టుదలతో కొలువుదీరే..!



కొనతం వారింట.. విజయగీతం

నడిగూడెం: నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన కొనతం వంశీరెడ్డి, గౌతమి డీఎస్సీ-2024 ఎంపిక ప్రక్రియలో ఎస్జీటీ ఉద్యోగాలు సాధించారు. వంశీ రెడ్డి సూర్యాపేట జిల్లాలో 82 ర్యాంకు సాధించగా, గౌతమి మహబూబాబాద్ జిల్లా నుంచి ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ మేరకు డీఈవో కార్యాలయం నుంచి తమకు ఫోన్ ద్వారా సమాచారం అందినట్లు తెలిపారు. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో రెండేళ్లుగా ఇంటిని వదిలి కోదాడలో ప్రత్యేకంగా గది అద్దెకు తీసుకొని సొంతంగా పరీక్షకు సిద్ధమైనట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఇద్దరూ ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. గతంలో పలు ప్రైవేటు ఉద్యోగాలు చేసి, ప్రభుత్వ కొలువు సాధించాలనే పట్టుదలతో చదివి, లక్ష్యాన్ని సాధించామన్నారు.


కొనతం వంశీరెడ్డి, గౌతమి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పేదింటి బిడ్డలు పట్టుదలతో చదివి ప్రభుత్వ కొలువులు సాధించారు. కూలి పనులు చేసి చదివించిన తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారు.

రెండో ప్రయత్నంలో..

నాయిని అనూష, పెంచికల్‌దిన్న



ద్వితీయ ప్రయత్నంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలి(ఎస్జీటీ)గా ఎంపికయ్యా. తొలిసారి 2017 డీఎస్సీలో పోస్టులు తక్కువగా ఉండటంతో ఉద్యోగం రాలేదు. నిరాశ చెందకుండా ప్రయత్నించి ఉద్యోగం సాధించడం ఆనందం కలిగించింది. తల్లిదండ్రులు రాజు, రత్తమ్మలు కూలి పనులు చేసి చదివించారు. డీఎస్సీలో 74.7 మార్కులతో * 65వ ర్యాంకు సాధించా.

ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తూ:

కోడిరెక్క విజయ్‌కుమార్, పెంచికల్‌దిన్న



ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తూ 2019 నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం కోసం అహర్నిశలు శ్రమించా. ఎట్టకేలకు డీఎస్సీలో జూనియర్ తెలుగు పండిట్ ఉద్యోగం సాధించగలిగాను. ఎస్జీటీగాను అవకాశం లభించింది. ప్రతి రోజు గ్రంథాలయానికి వెళ్లి చదివేవాడిని. పేద కుటుంబం కావడంతో ఉద్యోగ సాధన లక్ష్యంగా పెట్టుకుని విజయం సాధించా.

శభాష్.. దినేష్..!



మునగాల, న్యూస్‌టుడే: చిన్న వయసులో తండ్రి చనిపోగా తల్లి హోటళ్లలో పనిచేస్తూ వారిని పెంచి పెద్ద చేసింది. తల్లి పడుతున్న కష్టాలను చూసి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివి మూడు కొలువులు సాధించారు దినేష్.

❒ మునగాల మండల కేంద్రానికి చెందిన మండవ దినేష్ తండ్రి అతడి చిన్నతనంలో చనిపోయాడు. అప్పటి నుంచి తల్లి నాగమణి అన్నీ తానై హోటల్స్‌లో పనిచేస్తూ ఇద్దరు కుమారులను, కుమార్తెను పోషించింది. విద్యాభ్యాసం పూర్తయ్యాక దినేష్ కూలీ పనులు చేస్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడ్డారు. పనులు చేసుకుంటూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. డీఎస్సీ 2018 ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. అదే సంవత్సరం పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో, ఎస్జీటీ ఉద్యోగాన్ని వదులుకొని పోస్టల్ అసిస్టెంట్‌గా కోదాడలో విధుల్లో చేరారు. ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో 22వ ర్యాంకు సాధించి కొలువుకు ఎంపికయ్యారు.

ప్రమాదాన్ని గుర్తించి.. మరమ్మతులు నిర్వహించి

స్పందనకు వందనం

కోదాడ, న్యూస్‌టుడే: పట్టణం నుంచి ఖమ్మం వెళ్లే జాతీయ రహదారి పట్టణంలోని తమ్మర సమీపంలో గత నెల వచ్చిన వరదలకు కోతకు గురై పెద్ద లోయ ఏర్పడింది. 50 రోజులైనా, ప్రమాదం అంచున వాహనాలు వెళ్తున్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ నెల 7న 'ప్రమాదం జరగకముందే పట్టించుకోరూ..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జాతీయ రహదారి నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య మంగళవారం స్పందించి యుద్ధ ప్రాతిపదికన టిప్పర్లతో మట్టి పోయించి చదును చేయించారు. దీంతో వాహనదారులకు ఉపశమనం కలిగింది.

పత్తి సాగుపై అవగాహన

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా పత్తి సాగుపై కేవీకే గడ్డిపల్లి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లయోలా కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు.


మాధవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సమీక్షించి.. సూచనలు చేసి


హుజూర్‌నగర్: రామస్వామి గట్టు వద్ద ఆదర్శ కాలనీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: డిజిటల్ సర్వే నమోదు కార్యక్రమాన్ని హుజూర్‌నగర్ పురపాలక సంఘంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. 4వ వార్డులో చేస్తున్న డిజిటల్ కార్డు సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కార్యాలయంలో పురపాలక సంఘ వివిధ శాఖల అధికారులతో సమావేశమై శాఖలవారీగా సమీక్షించారు.

★ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి అర్హతలున్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పన్నుల వసూలు కార్యక్రమం తక్కువగా ఉందని, వాటిని పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వైస్ ఛైర్మన్ సంపత్ రెడ్డి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

★ ఆదర్శ కాలనీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదర్శ కాలనీ పనులను పరిశీలించి గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. అక్టోబరు చివరి నాటికి పనులు పూర్తి కావాలన్నారు.

పాలకవీడు గ్రామీణం: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో శాశ్వత ఆస్తులు కల్పించే విధంగా 2025-26 ఏడాదికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధరణి సమస్యలపై రైతుల నుంచి అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ భూములను కాపాడటంలో వెనకంజ వేయరాదని, ఆక్రమణలు ఎక్కడ ఉన్నా తొలగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నవంబరు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించనుందని అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీ ఉప కేంద్రాన్ని తనిఖీ చేసి అందుతున్న వైద్యసౌకర్యాలపై ఆరా తీశారు. మండలంలో ప్రభుత్వ వైద్యుడు లేరని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఒక వైద్యుడిని డిప్యుటేషన్‌పై పంపాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. జాన్‌పహాడ్, బొత్తలపాలెం, పాలకవీడు ఉన్నత పాఠశాలల్లో శౌచాలయాలు లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారని, నిర్మాణ వ్యయ అంచనాలు రూపొందించి పంపాలని ఎంఈవోను ఆదేశించారు. జగ్గయ్యపేట, విష్ణుపురం రైల్వే లైను నిర్మాణంలో బోరుబావులు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరగా దస్త్రాలను పరిశీలించి నివేదిక అందించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డీవో శ్రీనివాసులు, మండల ప్రత్యేకాధికారి శంకర్, తహసీల్దార్ కమలాకర్, ఎంపీడీవో లక్ష్మి, ఏవో కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డిజిటల్ సర్వే


కోదాడ పట్టణంలో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న పుర కమిషనర్ రమాదేవి


కోదాడ, అనంతగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ సర్వేను మంగళవారం అధికారులు పూర్తి చేశారు. నియోజకవర్గంలో అనంతగిరి మండలంలోని వసంతపురం గ్రామం, పట్టణంలోని 30వ వార్డు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికయ్యాయి. దీంతో అధికారులు ఈ నెల 3 నుంచి మంగళవారం వరకు ఐదు రోజుల పాటు ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కోదాడ పట్టణంలోని 30వ వార్డులో 395 ఇళ్లను సర్వే చేశారు. కొందరు పని నిమిత్తం బయటకు వెళ్లిన వారి వివరాలు కూడా చరవాణీలో సంప్రదించి వివరాలు తీసుకున్నారు. పట్టణ కమిషనర్ రమాదేవి పర్యవేక్షణలో సర్వే పూర్తి చేయడంతో పాటు వివరాలను ప్రభుత్వానికి పంపే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అనంతగిరి మండలంలో వసంతపురం గ్రామంలో 218 ఇళ్లల్లో డిజిటల్ సర్వేను నిర్వహించామని ఎంపీడీవో సుష్మ తెలిపారు.

మహాలక్ష్మీ నమోస్తుతే

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో మంగళవారం మహాలక్ష్మి అలంకరణలో ఉన్న అమ్మవారికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే బృందం:



హుజూర్‌నగర్ కనకదుర్గ ఆలయంలో..


మఠంపల్లి: హనుమంతులగూడెంలో..


నేరేడుచర్ల: శివాలయంలో..


కోదాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మునగాలలో..


కీతవారిగూడెంలోని ముత్యాలమ్మ గుడి వద్ద..


బూరుగడ్డలో..


మేళ్లచెరువులో..

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


సైదులు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని చింతబండకు చెందిన ఎడ్ల సైదులు(44) కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. భార్య జానమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు మృతదేహాలు లభ్యం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పొనుగోడు రిజర్వాయర్‌లో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. మహిళా మృతదేహం వేములపల్లికి చెందినది కాగా, రెండోది పురుషుడిది మిర్యాలగూడలోని సంతోష్‌నగర్‌కు చెందిన మోదాల నర్సింహగా గుర్తించారు. మహిళకు సంబంధించి వేములపల్లి పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు నమోదైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఎంబీసీ ఎత్తిపోతల ఆపాలని వినతి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ముక్యాల బ్రాంచి కెనాల్ ఎత్తిపోతల పథకం పనులు వెంటనే నిలుపుదల చేయాలని పలువురు రైతులు మేళ్లచెరువు, చింతలపాలెం తహసీల్దార్లకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ పథకం వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేకపోగా.. ఉన్న కాస్త సాగు భూమినీ కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే ఈ పథకం సర్వే పనులు మొదలు పెట్టగా తాము అడ్డుకోవడంతో విరమించారన్నారు. మళ్లీ పనుల కోసమని సర్వే చేస్తున్నారన్నారు. తమవి రెండు సీజన్‌లలో పంటలు పండించుకునే భూములేనని, ఆ భూముల్లో మళ్లీ ఎత్తిపోతల పైపులు, దారులు ఏర్పాటు చేయాలనుకోవడం మానుకోవాలని కోరారు.

'రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేమి'


శిథిలావస్థలో ఉన్న రహదారిని పరిశీలిస్తున్న నరేందర్‌గౌడ్, బాదె నర్సయ్య

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలో నాణ్యత లోపంతో రోడ్డును నిర్మించిన పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంటు అధికారులు, గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు సోమగాని నరేందర్ గౌడ్, ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మట్టపల్లి బైపాస్ రోడ్డు వేసి రెండు నెలలు గడవకముందే ఇరువైపులా కుంగిపోయిందన్నారు. ఈమధ్యనే రోడ్డుపై గుంతలూ పడ్డాయన్నారు. డివైడరు కూడా నాసిరకంగా నిర్మిస్తున్నారని ఆరోపించారు. నాణ్యత లేని పనులు చేయిస్తున్న అధికారులు, చేస్తున్న గుత్తేదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు ఉచితంగా మందుల పంపిణీ

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కాపుగల్లు పశు వైద్యశాలలో ఉచితంగా రూ.50వేల మందులను దాతల సహకారంతో పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడారు. పశువులలో కృత్రిమ గర్భధారణ చేయడంతో 90 శాతం ఆడదూడలే జన్మిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య, తొండపు సతీష్‌కుమార్, ముత్తవరపు పాండురంగారావు, కాసాని రామారావు, వెంకటాద్రి తదితరులున్నారు.


పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి శ్రీనివాస్, పాండురంగారావు తదితరులు

'ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి'

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయవద్దని ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ అన్నారు. ఎం.ఎస్. కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, కోటేష్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

నడిగూడెం: ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పి.నవీన్‌కుమార్ కోరారు. నడిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు సుప్రీంకోర్టు కల్పించిన చట్టబద్ధతను వెంటనే అమలు చేయాలన్నారు.

అవీ ఇవీ

సద్వినియోగం చేసుకోవాలి.. మునగాల గ్రామీణం: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ బుచ్చిపాపయ్య అన్నారు. తాడ్వాయిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నల్గొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

ప్రారంభం.. పాలకవీడు గ్రామీణం: గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అమలు చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ గోపాల్ తెలిపారు. ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో జాన్‌పహాడ్ ఆవాస గ్రామం కొత్తతండాలో సీసీ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు.

అభిషేకం.. హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డలోని శ్రీఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి పంచామృతాలతో మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. 108 తమలపాకులతో పూజ, గంధ సింధూరం, పూలమాలలతో అలంకరణ చేశారు. ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు, ఆలయ ఛైర్మన్ గురవయ్య, ధర్మకర్తలు అంజయ్య, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం.. గరిడేపల్లి: భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జిగా గరిడేపల్లి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కుర్ర గోపిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నియామక పత్రం అందించారు.

త్వరితగతిన పూర్తి చేయాలి.. మునగాల: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డీపీఎం ఐబీ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు మంగళవారం రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. బిల్లులు పెండింగ్‌లో ఉంచవద్దని, పనులు పూర్తికాగానే వెంటనే చెల్లించాలని అధికారులకు సూచించారు.

వినతి.. నేరేడుచర్ల: ప్రపంచశాంతిని కాపాడాలని కోరుతూ సీపీఐ నాయకులు మంగళవారం నేరేడుచర్ల తహసీల్దార్ సైదులుకి వినతి పత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు, లక్ష్మి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ.. చిలుకూరు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలను మంగళవారం కలిసి పరామర్శించారు. పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి భట్టు అమృతనాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, బాలాజీ పాల్గొన్నారు.

అవగాహన.. హుజూర్‌నగర్ గ్రామీణం: శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా పండగలు నిర్వహించుకోవాలని ఎస్సై ముత్తయ్య అన్నారు. మాధవరాయినిగూడెంలో శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

ఫిర్యాదు.. నడిగూడెం: నడిగూడెం ప్యాక్స్ మాజీ ఛైర్మన్ పి.రమేష్ పలు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ పాలకవర్గం సభ్యులు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని విలేకరులకు అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా లక్షల విలువైన పనులను టెండర్లు లేకుండా చేపట్టారని, గోదాం నిర్మాణం, రిపేర్ల పేరుతో సంఘం నిధులు కాజేశారని, పాలకవర్గం తీర్మానం లేకుండా రైతులకు సరఫరా చేయాల్సిన డీజిల్‌ను ట్యాంకర్ల ద్వారా సిమెంట్ కర్మాగారానికి సరఫరా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బతుకమ్మ సంబరాలు


బతుకమ్మలను తీసుకొస్తున్న పుర ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కమిషనర్ రమాదేవి తదితరులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడలోని శ్రీరామ గణేశ్ ఉత్సవ కమిటీ, భవానీనగర్, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పుర ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కమిషనర్ రమాదేవిలతోపాటు మహిళలు, చిన్నారులు నృత్యంతో అలరించారు.

నడిగూడెం: నడిగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీరామ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మలతో...


నడిగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో..

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని అన్నారం విద్యుత్తు ఉప కేంద్రంలో 33/11 కేవీ నియంత్రిక మార్పిడి కారణంగా బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి గాను ఎనిమిది ఎంవీఏ సామర్థ్యం గల నియంత్రికను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తామని, రైతులు, ప్రజలు గ్రహించాలని కోరారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌లో బ్రాహ్మణ కల్యాణ మండపం వద్ద సీసీ రహదారి అధ్వానంగా మారింది. గుంతలు పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - శంకర్, సూర్యాపేట

✔ మరమ్మతు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం. -శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

ఖాసింపేట, న్యూస్‌టుడే:

? సూర్యాపేట పురపాలిక పరిధిలోని ఖాసింపేటలో మురుగు కాల్వల్లో పూడిక తీయటం లేదు. దుర్వాసన, దోమల వృద్ధితో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్నారు. -షేక్ షబ్బీర్, ఖాసింపేట

✔ సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం. - సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

పట్టుదలతో చదివి.. కలల కొలువు సాధించి



వారంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారు. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసి.. ప్రభుత్వ ఉద్యోగం సాధించి స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డీఎస్సీ-2024 పరీక్షలో ప్రతిభ చాటి.. ఉద్యోగం సాధించి.. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఉత్తర్వులు అందుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన విజేతల మనోగతం వారి మాటల్లో..

నిరుపేద కుటుంబం నుంచి వచ్చి



- అక్కినపల్లి శైలజ, ఎస్జీటీ

మాది జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి. నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం నల్గొండకు వెళ్లారు. తండ్రి వెంకటయ్య కట్టె కోత మిషన్‌లో కూలీ పని చేస్తుండగా తల్లి లక్ష్మమ్మ ఇళ్లలో పని చేసి చదివించారు. నా భర్త సంతోష్ కానిస్టేబుల్. ఆయన ప్రోత్సాహంతో డీఎస్సీలో ప్రతిభ చాటి ఉద్యోగాన్ని సాధించాను.
- తుంగతుర్తి, న్యూస్‌టుడే:

నాన్న కల నెరవేర్చా..



- ప్రసన్న లక్ష్మి, ఎస్జీటీ

మాది బొల్లంపల్లి గ్రామం. నాన్న గద్దగూటి ముత్తయ్య ప్రైవేట్ పాఠశాలలో ఐదెళ్ల సంవత్సరాలుగా చాలీచాలని వేతనంతో పని చేసి కష్టపడి చదివించారు. ప్రభుత్వ ఉపాధ్యాయినిగా చూడాలన్న ఆయన కోరిక మేరకు కష్టపడి చదివాను. ఎస్జీటీలో ఉద్యోగం సాధించాను.
- జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే:

కూరగాయలు అమ్మి చదివించారు

- కనుక నాగరాజు, అర్వపల్లి



తల్లిదండ్రులు కనుక సోమయ్య - యాదమ్మ ఆకుకూరలు సాగు చేసి నన్ను చదివించారు. సర్కారు కొలువు సాధించాలని పట్టుదలతో చదివి ఇటీవలనే గురుకుల పాఠశాలలో టీజీటీ ఉద్యోగం సాధించాను. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్)కు ఎంపికయ్యాను. రెండు ఉద్యోగాలు రావడంతో తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు.

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే:

భర్త ప్రోత్సాహంతోనే విజయం



- మార్గం విజయ, లింగంపల్లి, తెలుగు పండిట్

మాది నిరుపేద కుటుంబం. పాఠశాల స్థాయిలోనే నాన్న చనిపోయారు. అమ్మ అండగా ఉంటూ చదివించారు. మా గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహితుడిని వివాహం చేసుకున్నా. నా భర్త అన్ని విధాలుగా ప్రోత్సహించడంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో తెలుగు లాంగ్వేజ్ పండిట్‌గా ఎంపికయ్యాను.

తినుబండారాలు అమ్ముతూ.. మూడు ఉద్యోగాలు

- యలగందుల వెంకటనారాయణ, తెలుగు పండిట్ స్కూల్ అసిస్టెంట్



భార్య, ఇద్దరు కుమార్తెలతో యలగందుల వెంకటనారాయణ

మాది చిల్పకుంట్ల గ్రామం. జీవనోపాధి కోసం సూరత్‌కు వలస వెళ్లిన నాన్న యలగందుల బుచ్చిరాములు, తల్లి పూలమ్మ కష్టపడి నన్ను చదివించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దని ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. భార్య, ఇద్దరు కుమార్తెలను పోషించుకోవడానికి అగ్గిపెట్టెలు, తినుబండారాలు అమ్ముతూనే రెండు సార్లు డీఎస్సీ రాశాను. త్రుటిలో ఉద్యోగం చేజారింది. ఉద్యోగానికి వయస్సు కూడా దాటిపోతుండటం పట్టుదలతో చదివాను. జులైలో గురుకుల ఉపాధ్యాయ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 19 ర్యాంకు సాధించి ఆత్మకూర్(ఎస్) గురుకుల పాఠశాలలో విధుల్లో చేరాను. గతంలో దాదిగురుకుల పాఠశాలలో తెలుగు పండిట్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తున్నా. మంగళవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు పండిట్‌తో పాటు, (గ్రేడ్-2 తెలుగు పండిట్ ఉద్యోగం సాధించాను. ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపికవడంతో నాన్న కళ్లలో ఆనందం కనిపించింది.
- నూతనకల్, న్యూస్‌టుడే:

మద్దిరాల, న్యూస్‌టుడే:

నాన్న కోరిక.. అన్న ప్రోత్సాహం



- పరల నాగరాజు, పోలుమళ్ల

డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో 5వ ర్యాంకు సాధించి తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. తండ్రి కోరిక మేరకు కష్టపడి చదివి 2023లో బీఈడీ పూర్తి చేశా. తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించా. నా అన్న ప్రయివేటు ఉద్యోగం చేస్తూ నన్ను ప్రోత్సహించారు. తండ్రి కోరిక నెరవేర్చిన తరుణంలో ఆయన లేకపోవడం బాధగా ఉంది.

కుటుంబ భారాన్ని మోస్తూ..



- వల్లపు వర్జ, ఎస్జీటీ

మాది మద్దిరాల మండలం పోలుమళ్ల. నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు వెంకన్న, కోమల. ముగ్గురు కుమార్తెల్లో నేను పెద్ద. ఇంటర్ వరకు చదివిన తర్వాత వివాహం చేశారు. ఇద్దరు పిల్లలు సంతానం. నా భర్త తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తున్నారు. భర్త సహకారంతో టీటీసీ, డిగ్రీ, బీఈడీ, పీజీ, డీఎస్సీకి చదివాను. కొంత కాలంగా తుంగతుర్తిలో రక్త పరీక్ష కేంద్రాన్ని నిర్వహిస్తున్నా. పగలు కేంద్రాన్ని నిర్వహిస్తూ, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ రాత్రి వేళలో మాత్రమే చదివాను. డీఎస్సీలో 107 ర్యాంకును సాధించి ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికయ్యా.

ప్రైవేటు ఉద్యోగం చేస్తూ..



- ఐజయ్య లింగయ్య, ఎస్జీటీ, తుంగతుర్తి

అమ్మానాన్న ఐజయ్య వెంకన్న, పద్మ కూలీనాలీ చేసి ముగ్గురు సోదరులను చదివించారు. రెండో కుమారుడైన నేను తుంగతుర్తిలో పది వరకు చదివి ఇంటర్ టీటీసీని సూర్యాపేటలో పూర్తి చేశాను. కుటుంబం గడవటం ఇబ్బందిగా ఉండటంతో చదువు మానేసి ప్రైవేట్ ఉద్యోగం చేసి భార్యాపిల్లలను పోషించుకున్నా. డీఎస్సీ నోటిఫికేషన్ రావాలనే ఉద్యోగం మానేసి ఇంటి దగ్గర ఉండి రేయింబవళ్లు కష్టపడి చదివి డీఎస్సీలో 70వ ర్యాంకు సాధించా.

మూడు కొలువులు సాధించా..



- బట్టిపల్లి మౌనిక, ఎస్జీటీ

మాది మునగాల మండలం నేలమర్రి. తల్లిదండ్రులు బట్టిపల్లి వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి. ఏడాది క్రితం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభను కనబర్చి మూడు ఉద్యోగాలకు ఎంపికైయ్యాను. కస్తూర్బాగాంధీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో పీజీటీ (ఫిజిక్స్), ఎస్వో(ప్రత్యేకాధికారిణి) ఉద్యోగాలు సాధించాను. ఏడాది నుంచి తుంగతుర్తిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయ ప్రత్యేకాధికారిణిగా విధులు నిర్వహిస్తున్నా. డీఎస్సీలో 107వ ర్యాంకును సాధించి ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికయినందుకు సంతోషంగా ఉంది.

ఫలించిన పదేళ్ల నిరీక్షణ

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన పలువురు యువతీయువకులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం పదేళ్లు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చిలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ ప్రకటన డీఎస్సీతో వచ్చిన అవకాశాన్ని వారు జారవిడవలేదు. మొక్కవోని పట్టుదల, ఏకాగ్రతతో చదివి ఉపాధ్యాయ కొలువులు సాధించారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాలలో ఆత్మకూర్(ఎస్) మండలం నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయ పోస్టులు దక్కించుకున్నారు. వారిలో పాతసూర్యాపేటకు చెందిన గున్నాల జగదీశ్వర్‌రెడ్డి 1వ ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్(గణితం), మండల కేంద్రానికి చెందిన గొట్టిముక్కుల వెంకటరెడ్డి స్కూల్ అసిస్టెంట్(గణితం) పోస్టుకు ఎంపికయ్యారు. ఎస్జీటీలుగా పాతసూర్యాపేటకు చెందిన బందారు భవాని, గోలి సురేష్(నెమ్మికల్), తోట రాజు(పాత్లరపహాడ్), జటంగి ఉపేందర్(బొప్పారం), షేక్ అశ్వాక్(ఏపూర్) ఎంపికయ్యారు.



☛ కందగట్ల గ్రామ పంచాయతీ పరిధి భజనతండాకు చెందిన జాటోత్ భిక్షం అంధ విభాగంలో 542 ర్యాంకుతో తెలుగు పండిట్ పోస్టుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ కొలువు సాధించిన వారికి ఆయా గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి

మద్దిరాల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువరైతు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూతం వెంకన్నకు ముగ్గురు కుమారులు సంతానం. చిన్న కుమారుడైన భూతం కృష్ణ(24) రోజు మాదిరిగానే ఉదయం పొలం వద్దకు వెళ్లారు. స్తంభం నుంచి విద్యుత్తు మోటారుకు ఉన్న కరెంటు తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా కృష్ణ సెల్‌ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి మృతిచెంది ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరన్న తెలిపారు.

వ్యక్తికి దేహశుద్ధి

సూర్యాపేట నేరవిభాగం: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన సూర్యాపేట పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతలచెరువు శేఖర్ మంగళవారం సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి మహిళ చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించడంతో అక్కడే ఉన్న ఆమె బంధువులు అతన్ని చితకబాదారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువురిని సర్దిచెప్పటంతో గొడవ సద్దుమణిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

సూర్యాపేట నేరవిభాగం: మండలంలో ఇసుక డంపులపై సూర్యాపేట గ్రామీణ ఎస్సై బాలు నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. మండలంలోని కాసరబాదలో పలువురు అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను మంగళవారం గ్రామీణ పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక నిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నూర్జహాన్‌పేట శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా చివ్వెంల మండలం రాంకోటి తండాకు చెందిన దరావత్ లింగా, అతని బావమరిది మోర సకుంత తండాకు చెందిన భానోత్ శ్రీను 4.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం మినీలారీలో విక్రయించేందుకు అక్రమంగా ఆటోలో తరలిస్తున్నారు. ఆ బియ్యం స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామని ఎస్సై రవీందర్ తెలిపారు.

బెల్లంపానకం, సారా స్వాధీనం.. నలుగురిపై కేసు నమోదు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పోలీసులు, తుంగతుర్తి ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో, ఆత్మకూర్(ఎస్) పోలీసుల సహకారంతో మండలంలోని మంగలితండా, కోట్లీనితండా, పీపాగానాయక్‌తండాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సోదాలు చేశారు. ఈ సందర్భంగా 50 లీటర్ల బెల్లంపానకం, పది లీటర్ల సారాయి పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై సైదులు, సూర్యాపేట, తుంగతుర్తి ఎస్సైలు సురేందర్ బెనర్జీ, జయప్రకాశ్, డీటీఎఫ్ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అర్వపల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీనారసింహ స్వామి దేవాలయం ఆవరణలోని దుర్గామాత విగ్రహం వద్ద సోమవారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి గెలుచుకున్న సుష్మకు అమ్మవారి మొదటి రోజు అలంకరించిన చీర, ద్వితీయ బహుమతి మనీష, తృతీయ బహుమతి విజయలక్ష్మికు రూ.1000 లు చొప్పున నగదు అందజేశారు. 15 మందికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: అధిక లాభాలు అందిస్తున్న ఆయిల్‌పామ్ తోటలపై రైతులు దృష్టిసారించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి తీగల నాగయ్య అన్నారు. మండలంలోని మాచారం గ్రామంలో తీకుళ్ల శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. ఈ మొక్కలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని చెప్పారు. ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం నుంచి బిందు సేద్య పరికరాలు, ఎరువులకు రాయితీ లభిస్తుందని, ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిణి స్వాతి, సూపరింటెండెంట్ నరహరి, వరికోల్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతికి కృషి: జడ్పీ సీఈవో

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మహిళల జీవనోపాధి మెరుగుపరచి ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని డీఆర్డీవో, జడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య సహాయక సంఘ సభ్యులు



మహిళా సమాఖ్య కార్యాలయంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో అప్పారావు

సహానికి న్యూయెంటర్ ప్రైజెస్ పథకంతో ఏర్పాటు చేసిన యూనిట్ కుట్టుమిషన్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. తొలుత ఉపాధిహామీ, మహిళా సమాఖ్య కార్యాలయాల అధికారులతో సమీక్ష జరిపారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు ఉపాధి కల్పనకు అన్ని గ్రామాల్లో పనులు గుర్తిస్తున్నామని చెప్పారు. చిన్ననీటి గుంటలు, చెరువుల్లో నీటి నిల్వలు పెంపొందించేందుకు పూడిక తొలగింపు, పంట కాల్వల పూడికతీత, పొలం గట్లపై కొబ్బరి, టేకు మొక్కలు నాటడం, చిన్న, సన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం, పాడి పశువుల కొట్టాలు, ఇళ్లలో ఇంకుడు గుంతలు తదితర పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరశురామ్, ఏపీవో రవి, ఏపీఎం అజయ్‌నాయక్, ఈసీ మహేష్, టీఏలు ఏకాస్వామి పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపిక

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గుజ్జ భాస్కర్, జాటోత్ రాజన్న పీఆర్టీయూ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సంఘ సమావేశంలో వీరిని ఎంపిక చేశారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే..!



సూర్యాపేట: సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మద్దిరాలలో చండీ అవతారంలో దుర్గామాత



సూర్యాపేటలో మహాలక్ష్మి అవతారంలో సంతోషిమాత

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకులు అమ్మవారికి పేరున అర్చన అష్టోత్తర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంతోషిమాత ఆలయంలో కుంకుమార్చనలు, సామూహిక లలితా సహస్రనామ పారాయణం, చండీహోమం, రుద్రహోమం నిర్వహించారు. మద్దిరాల: మండల కేంద్రంలో ఆమంచి అనంతరామశాస్త్రి నివాసంలో దుర్గామాతను చండీ అవతారంలో అలంకరించారు.

నూతనకల్: ఉత్సవాల్లో భాగంగా తాళ్లసింగారంలో మహిళలు కోలాటాలతో భక్తిని చాటుకున్నారు. యడవెల్లిలో అన్నదానం చేశారు. నూతనకల్‌లో కుంకుమ పూజ చేపట్టారు. తిరుమలగిరి: తిరుమలగిరి తెలంగాణ చౌరస్తాలో మంగళవారం అన్నదానాన్ని ఎస్సై సురేష్ ప్రారంభించారు. నాగారం: మండలంలోని పణిగిరి, మాచిరెడ్డిపల్లి, వర్ధమానుకోట గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల దగ్గర మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తిరుమలగిరి తెలంగాణ చౌరస్తాలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై సురేష్



పణిగిరిలో దుర్గామాత విగ్రహం దగ్గర పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, తదితరులు

భగీరథ జలాలను బోరు నీటితో కలపొద్దు



నూతనకల్‌లో మంచినీటి స్వచ్ఛతను పరీక్షించే విధానాన్ని వివరిస్తున్న నిపుణుడు

నూతనకల్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలో ఇంటింటికి సరఫరా చేసే మంచినీటి స్వచ్ఛతను ఎప్పటికప్పుడు పరీక్షించి, నీటి స్వచ్ఛత పై జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అజయ్ సూచించారు. నూతనకల్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మిషన్ భగీరథ జలాలను బోరునీటితో కలిపితే నాణ్యత తగ్గుతుందని, వాటిని ప్రజలకు సరఫరా చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఉదయ్‌కుమార్, అఖిల్, అశోక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అర్వపల్లి కస్తూర్బా విద్యాలయంలో 2013-14 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం విద్యాలయంలో సమావేశమయ్యారు. పదేళ్ల తర్వాత కలుసుకొన్న వారంతా నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులు తేజశ్రీ, విజయశ్రీ, రాధిక, సంధ్య, స్వాతి, లలిత, సునీతలను సన్మానించారు. ఎస్వో నాగరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అవీ ఇవీ

బల్ల బహూకరణ.. మద్దిరాల గ్రామీణం: గోరెంట్ల గ్రామానికి చెందిన విశ్రాంత జిల్లా వ్యవసాయాధికారి మద్ది చంద్రయ్య కుమారుడు మద్ది మహేష్‌కుమార్ జన్మదినం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.పది వేల విలువ చేసే బల్లను మంగళవారం అందజేశారు.

క్రీడలతో స్నేహభావం.. పెన్‌పహాడ్: క్రీడలతో స్నేహభావం, మానసికోల్లాసం లభిస్తుందని కాంగ్రెస్ మండల నాయకుడు దొంగరి గోపీకృష్ణ అన్నారు. విజయదశమి సందర్భంగా మండలంలోని న్యూబంజారాహిల్స్ తండాలో న్యూస్టార్ బంజారా యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తుల పరిమిత గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3113	1449
జైశ్రీరాం	3329	1789
ఐఆర్-64	1976	1569
హెచ్‌ఎంటీ	2669	2368
బాస్మతి	1709	1579
కందులు	9464	2456
పెసర	7019	2214
వేరుసెనగ	7109	3009

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తుంగతుర్తి నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్, తుంగతుర్తి మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం పంపిణీ చేశారు. 80 మందికి రూ.30 లక్షల విలువ చేసే చెక్కులు అందజేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.



తిరుమలగిరిలో బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఛైర్మన్ పాలెపు చంద్రశేఖర్, నాగం జయసుధ, కుంట్ల సురేందర్‌రెడ్డి, తాళ్లూరి మురళి, పేలపూడి వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు సొసైటీల సాయం..

తుంగతుర్తి: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు నియోజకవర్గంలోని పీఏసీఎస్ ఛైర్మన్లు రూ.70 వేలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం తిరుమలగిరిలోని

జిగురు అట్టలతో చీడ పురుగుల నివారణ

నూతనకల్, న్యూస్‌టుడే: మిరప తోటలో ప్రస్తుతం తామర పురుగులు, నల్లి, తెల్లదోమ ఆశిస్తోందని, వీటిని నివారించడానికి ఎకరాకు 50 నుంచి 100 వరకు జిగురు అట్టలు ఏర్పాటుచేసుకోవాలని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త సీహెచ్.నరేష్ పేర్కొన్నారు. నూతనకల్ మండలంలోని యడవెల్లి, చిల్పకుంట్లలో మంగళవారం మిరప తోటలను పరిశీలించి రైతులకు సూచనలు అందించారు.



మిరప తోటలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త సీహెచ్.నరేష్

మిర్చిలో జీవన ఎరువుల ప్రాముఖ్యం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించి తప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాస్త్రవేత్త ఆదర్శ్ రైతులకు వివరించారు. వేరుకుళ్లు లేదా ఎండుతెగులు నివారణకు ట్రైకోడెర్మా, సుడోమోనాస్ 10 గ్రాములు, తెగుళ్ల ఉధృతి ఉంటే మెటలాక్సిల్, మ్యాంకోజెబ్ మందును ఒక లీటరు నీటికి రెండు మిల్లీలీటర్లు చొప్పున కలిపి చెట్టు పాదుల్లో 100 మిల్లీలీటర్లు పోయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ జన్ ఉద్యానాధికారిణి వి.ప్రణీత, రైతులు గాజుల రమేష్, బయ్య దేవయ్య, బొమ్మెర మల్లయ్య, తూముల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.